క్లుప్తంగా

సాంకేతిక చదువులతో ఉద్యోగాలు



ఎంపికైన వారికి నియమాక పత్రాలు అందజేస్తున్న అధికారులు

జమ్మలమడుగు రూరల్ : చిన్న వయసులో విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం హర్షనీయమని దాల్మియా సిమెంట్ సీనియర్ మేనేజర్ వి.రామరాజు పేర్కొన్నారు. జమ్మలమడుగు మండలం అంబవరం గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రిన్సిపల్ సురేంద్రనాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామరాజు మాట్లాడుతూ సాంకేతిక చదువులతో రాబోయే రోజుల్లో మంచి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన 33 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఈఈ గోపాలుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కసునూరులో కార్డెన్ సర్చ్



ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

సింహాద్రిపురం : మండలంలోని సమస్యాత్మక గ్రామమైన కసునూరులో ఎస్సై అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు జరిపారు. అనంతరం గ్రామ వీధులలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కానింగ్ కేంద్రాలపై నిఘా



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటేశులు

పులివెందుల టౌన్ : భ్రూణ హత్యల నివారించాలంటే.. స్కానింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉండాలని పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ అడ్వైసర్ కమిటీ యాక్ట్‌పై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఆడబిడ్డల అభివృద్ధిని అందరూ బాధ్యతగా తీసుకోవాలని, గర్భంలోనే ఆడ శిశువుని గుర్తించి భ్రూణ హత్యలకు పాల్పడకుండా చూడాలని కోరారు. ఆడ శిశువుకు జన్మనిచ్చి వారిని బాగా చదివించాలన్నారు. వైద్యుల సిఫార్సు లేకుండా మందులిచ్చే దుకాణాలు, ఏజెన్సీలపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. బేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమాలు చురుగ్గా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఖాజామొయినుద్దీన్, ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత, వైద్యులు డా.అనన్య, డా.షాలిని, స్నేహ, ప్రత్యూష, శాంతికుమార్, స్నేహిత, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవసరమైన విత్తనాలను అందించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని రైతులందరికీ అవసరమైన అన్ని రకాల విత్తనాలు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం వి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు కడప తహసీల్దార్ వెంకటరమణ కు ఏపీ రైతు సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సరిపడా అన్ని రకాల విత్తనాలను 90 శాతం రాయితీతో అందించాలన్నారు. ప్రధానంగా వరి సాగుకు సంబంధించి రైతులు ముందుగా పొలంలో ఎరువు కోసం వేసేందుకు జీలుగలు, మినుము , పెసర విత్తనాలు తక్షణం అందించాలన్నారు. రబీ పంట నష్టపరిహారాన్ని తక్షణం రైతులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు మనోహర్ రెడ్డి , బాలచంద్రయ్య, శంకర్ రెడ్డి, కేసిబాదుల్లా, లింగన్న, భద్రయ్య, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

సీమ ప్రజలకు థామస్ మన్రో విశేష సేవలు

కడప రూరల్ : రాయల సీమ ప్రాంతానికి కడప జిల్లా మొదటి కలెక్టర్ థామస్ మన్రో విశేష సేవలు అందించారని సర్ థామస్ మన్రో సేవా సమితి చైర్మన్ బిషప్ డాక్టర్ కె.శ్యామూల్ బాబు అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌కే నగర్ లోని షాలోమ్ ప్రార్థనా మందిరం ఆవరణలో మన్రో జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిషప్ శామ్యూల్ బాబు మాట్లాడుతూ థామస్ మన్రో కడప జిల్లా మొదటి కలెక్టర్‌గా పని చేసి జిల్లా ప్రజలకు అత్యున్నత సేవలందించిన మహనీయుడన్నారు. మన్రో సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని హితవు పలికారు.



బోటింగ్‌లో సందర్శకులు



లేక్ ఫ్రంట్‌లో పచ్చిక బయళ్లు

ప్రకృతితో ఆహ్లాదం.. బోట్‌లో విహారం

కాస్త ఉల్లాసం కావాలంటే అక్కడికి వెళ్లాల్సిందే.. సాయంత్రం సేద తీరాలంటే అక్కడ వాలిపోవాల్సిందే.. భానుడు ప్రతాపానికి అలసిపోయిన జనానికి ఆహ్లాదం పంచేందుకు వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్ ఇప్పుడు కొత్త అందాలతో మరింత కనువిందు చేస్తోంది. ప్రకృతి ఒడిలో సేద తీరేందుకు, పచ్చని ప్రదేశాల్లో గడిపేందుకు ఉల్లిమెల్ల వేదికగా మారింది. ఖర్చుతో కూడిన వ్యవహారమైనా స్థానికులకు ప్రకృతిని పరిచయం చేయాలనే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తీర్చిదిద్దేలా చేయడంతో ఆహ్లాదం, ఆనందం పంచుతోంది.

- రికార్డు సృష్టించిన డా.వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్ పార్కు
- 65 రోజుల్లో ఆహ్లాదం కోసం 50 వేల మంది సందర్శన
- ఆకర్షిస్తున్న లేజర్ షో, మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్



డా.వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ముఖద్వారం

పులివెందుల : పులివెందుల పట్టణంలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఉద్యానవనం ప్రజలకు ఆహ్లాదం పంచుతూ రికార్డు సృష్టించింది. ఈ ఉద్యానవనాన్ని దాదాపు 104 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. విస్తారమైన పార్కింగ్ సౌకర్యం, మ్యూజికల్ వాటర్ ఫౌంటెయిన్, లేజర్ షో, విశాలమైన ఆట స్థలం ఉండడం అందరినీ ఆకర్షించింది. ప్రవేశ ద్వారంలో ఏర్పాటుచేసిన ఫౌంటైన్ 'ఐ లవ్ పులివెందుల' సెల్ఫీ పాయింట్ స్క్రాప్ బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. 2024 మార్చి, 16న అన్ని హంగులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించగా, 65 రోజుల్లోనే 50 వేల మంది ఈ పార్కును సందర్శించడంతో జిల్లాలోనే టాప్‌గా నిలిచింది.

ఉల్లాసంగా... ఉత్సాహంగా...

ఎటు చూసినా పచ్చిక బయళ్లతో ఉద్యానవనంలో ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తోంది. వీటి మధ్య స్టోన్ గజీబోలు, ఎంఎస్ పర్‌గోలా గజీబోలు అలసిసొలసిన సందర్శకుల మనస్సుకు ఉల్లాసం... ఉత్తేజం నింపుతున్నాయి. చుట్టూ పచ్చిక మైదానం మధ్య చెరువు నీటితో కళకళలాడుతూ సందర్శకుల మనస్సుకు ఆనందం కలిగిస్తోంది. ఎక్కువ మంది యువత, చిన్నారులు బోట్‌లో వెళ్తూ 'ఏమి హాయిలే ఇలా..' అని సంబరంగా గడుపుతున్నారు. 65 రోజుల్లోనే దాదాపు 6వేల మంది బోటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకోవడం విశేషంగా చెప్పవచ్చు. ఎక్కువ మంది యువత పెడల్ బోటింగ్, చిన్నారులు, పెద్దలు మోటారు బోట్ వినియోగించుకొని ఆనంద పరవశంలో మునిగిపోతున్నారు.

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమాలు

డా.వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో సందర్శకులను అలరించడానికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. వారాంతపు రోజులు, పండగ పర్వదినాల్లో స్థానిక స్కూల్ విద్యార్థులు, డ్యాన్స్ అకాడమీ చిన్నారులతో ఏర్పాటుచేసే నృత్య ప్రదర్శనలు అలరిస్తున్నాయి. లేక్ ఫ్రంట్‌కు కుటుంబసమేతంగా వచ్చి సేద తీరుతున్నారు.

ఏప్రిల్‌లోనే 24 వేల మంది



పట్టణంలోని వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌ను ప్రజలు చక్కగా సద్వినియోగం చేసుకున్నారు. గత ఏప్రిల్‌లో శ్రీరామనవమి, రంజాన్ రావడంతో ఎక్కువమంది పార్కును సద్వినియోగం చేసుకున్నారు. 24 వేల మంది సందర్శించడం ఓ రికార్డుగా చెప్పవచ్చు. మొత్తంమీద 65 రోజుల్లో 50 వేల మంది సందర్శకులు రావడం గొప్ప విషయం.

- సుధాకర్, ఏవో, డా.వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్

పులివెందుల ప్రజలకు ఆహ్లాదం



పులివెందుల ప్రాంత ప్రజలకు వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్ ఎంతో ఆహ్లాదాన్నిస్తోంది. గతంలో ఇలాంటి సౌకర్యాలతో పార్కులు, బోటింగ్‌లు సిటీలలో మాత్రమే ఉండేవి. అయితే పులివెందుల ప్రాంత ప్రజల కోసం లేక్ ఫ్రంట్ ఏర్పాటు చేయడం అభినందనీయం. ఈ ప్రాంత ప్రజలు, కుటుంబంతో కలిసి సాయంత్రం వేళల్లో ఇక్కడ సంతోషంగా గడుపుతున్నారు.

- సుధ, సందర్శకురాలు

సుంకులమ్మ తిరునాల



పూజలందుకుంటున్న సుంకులమ్మ అమ్మవారు

కమలాపురం : పట్టణంలోని పడమట వీధి సమీపంలో చెరువు కట్టపై వెలసిన వరాల సుంకులమ్మ తల్లి నవమ తిరునాల ఉత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేద పండితులు పవన్‌కుమార్ శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహాగణపతి పూజ, పంచగవ్య ప్రాసన, ప్రోక్షణ, ఋత్విక్ కరణం, కంకణ ధారణ, ప్రధాన కలశ స్థాపన చేశారు. అనంతరం సుంకులమ్మ అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన జరిపారు. అనంతరం మహామంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. సమీప ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

గరుడ వాహనంపై చెన్నకేశవస్వామి



గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత మార్కెట్ లోని మహాలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం చెన్నకేశవస్వామి, మహాలక్ష్మి మూల విరాట్‌లకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు.

పెండింగ్ బిల్లులు వసూలు చేయాలి

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల పట్టణంలో గృహ నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లుల వసూళ్లపై దృష్టి పెట్టాలని తహసీల్దారు సౌజన్య లక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ రామక్రిష్ణయ్య తెలిపారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో సోమవారం జరిగిన సమీక్షలో వారు మాట్లాడుతూ గుత్తేదారులు పనులు చేసి లబ్ధిదారుల ఖాతాలో పడిన బిల్లులను రికవరీ చేయాలని కోరారు. మెప్మా, సచివాలయ సిబ్బంది సంయుక్తంగా బిల్లులు వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రామక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



గృహ నిర్మాణ పనులపై సూచనలిందిస్తున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, కమిషనర్ రామక్రిష్ణయ్య

తాగునీటి సమస్యలు పరిష్కరించండి

కొండాపురం : గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ లక్ష్మిదేవి సూచించారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పల్లెల్లో సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. అనంతరం అధికారులు ఆయా శాఖల పురోగతిపై వివరించారు. ఖరీఫ్‌లో సాగు చేసే రైతులకు వేరుశనగ విత్తన కాయలు రాయితీపై ఇస్తామని వ్యవసాయాధికారి రామాంజనేయులురెడ్డి తెలిపారు. ఆర్బీకేల్లో ఎరువులు, విత్తన కాయలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో తక్కువ అంశాలపై చర్చించి ముగించేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగ ప్రసాద్, ఉప మండలాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రాజేశ్వరి, ఓబులేసు, రామయ్య, రాజశేఖర్‌రాజు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

వంట ఏజెన్సీల నిర్వాహకులకు శిక్షణ

చింతకొమ్మదిన్నె : ప్రభుత్వ పాఠశాలల్లో 'గోరుముద్ద' పథకం కింద అందించు ఆహార పదార్థాలు నాణ్యతగా, రుచిగా ఉండేలా చూడాలని ఎంఈఓ-1 వెంకట్రామిరెడ్డి, ఎంఈఓ-2 రమాదేవి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథక వంట ఏజెన్సీ నిర్వాహకులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓలు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తోందన్నారు. భోజనం తయారీ విధానం, శుభ్రత, మెనూ, పౌష్టికాహారం- ఉపయోగాలు అంశాలపై రిసోర్స్ పర్సన్స్ రాయప్పరాజు, చిట్టిబాబు వివరించారు. భోజన తయారీలో శుచి, శుభ్రత, నాణ్యత అంశంపై షేక్ రిహానా వివరించారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వంట ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, రమాదేవి

విస్తారంగా మిరప సాగు



సాగులో ఉన్న మిరప పంట

పులివెందుల నియోజకవర్గంలో మిరప సాగు ఆశాజనకంగా ఉంది. ఈ ఏడాది వేల హెక్టార్లలో రైతులు మిరప పంట సాగుచేశారు. గత ఏడాది తరహాలోనే పంటకు గిట్టుబాటుధరలు లభిస్తే లాభాలుంటాయని రైతులు చెబుతున్నారు.

- పులివెందుల రూరల్

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలోని డిగ్రీ కళాశాల రోడ్డులోని 33 కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ కిందటి ప్రాంతాల్లో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్తు శాఖ ఏఈఈ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ కాలేజ్ ఫీడర్ కింద చెట్లు కొట్టే కార్యక్రమం ఉండడంత సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

31న వ్యాసరచన, క్విజ్ పోటీలు

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏపీ కాలుష్యమండలి కడప ప్రాంతీయ కార్యాలయ ఇంజినీర్ అనిల్ కుమార్‌రెడ్డి తెలిపారు. 'భూ పునరుద్ధరణ, ఎడారీకరణ, కరవును స్థితిస్థాపకత', పర్యావరణ పరిరక్షణ అన్న అంశాలపై వ్యాసరచన, క్విజ్ కాంపిటీషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 31వ తేదీ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కళాశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఒక విభాగంగాను, ఇంటర్ నుంచి డిగ్రీ విద్యార్థులు మరొక విభాగంగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలుగా నిలిచే విద్యార్థులు జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

మూల్యాంకన కేంద్రం తనిఖీ

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం డిగ్రీ పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూల్యాంకన విధులకు హాజరైన అధ్యాపకులతో మాట్లాడుతూ సౌకర్యాలపై ఆరా తీశారు. సకాలంలో సమాధాన పత్రాలు దిద్దే ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. క్షుణ్ణంగా ఒకటికి రెండుసార్లు పరిశీలించి మార్కులు ఇవ్వాలని సూచించారు. ప్రతిభకు న్యాయం జరగాలన్నారు. పరీక్ష ఫలితాల విడుదల మీ మీద ఆధారపడి ఉంటుందన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి 60 పుస్తకాలు అందజేత

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ స్మారక భాషా పరిశోధన కేంద్రానికి మరికొన్ని పుస్తకాలు చేరాయి. అనంతపురం ప్రభుత్వ పురుషుల కళాశాల జంతుశాస్త్ర విభాగం అధ్యక్షులు లక్ష్మీ నరసింహ ప్రసాద్, అదే కళాశాల ఇంగ్లీషు లెక్చరర్ ఎస్ఈ అహ్మద్, తంగేడుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఆర్.మనోహర్ నాయక్, కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీం బాషాతో కలిసి సోమవారం 60 పుస్తకాలను గ్రంథాలయానికి ఇచ్చారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాద రెడ్డి మాట్లాడుతూ లక్ష్మీ నరసింహ ప్రసాద్ బహూకరించిన గ్రంథాలలో సైంటిఫిక్, చరిత్ర, ఆధ్యాత్మిక, మానసిక శాస్త్రాలకు సంబంధించిన పలు పేరు గాంచిన పుస్తకాలు ఉన్నాయని తెలిపారు.

వైఎస్సార్‌సీపీదే అధికారం

జమ్మలమడుగు : సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తిరిగి అధికారంలోనికి రావడం తథ్యమని ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి(ఉత్తర అమెరికా) పండుగాయల రత్నాకర్ అన్నారు. యూఎస్‌ఏ సోషల్ మీడియా కో–కన్వీనర్ చిలాల కిరణ్‌రెడ్డి, పలువురు ఎన్‌ఆర్‌ఐలు ఎర్రగుంట్ల మండలం నిడిజివ్వి గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లాలో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 9న విశాఖపట్నంలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని, మహిళలు భారీ స్థాయిలో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారన్నారు. సోషల్ మీడియా కో–కన్వీనర్ చిల్లా కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ మంచి జరిగి ఉంటే తనకు మద్దతు పలకాలని ధైర్యంగా చెప్పిన ఏకైక నాయకుడు జగన్ అన్నారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎన్‌ఆర్‌ఐలు

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

పులివెందుల రూరల్ : మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డా.లిఖిత పేర్కొన్నారు. నల్లపురెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఋతుచక్ర పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.లిఖిత మాట్లాడుతూ ప్రతినెలా ఋతుస్రావం అనేది సర్వసాధారణమన్నారు. సరైన పరిశుభ్రత పాటిస్తే అంటువ్యాధులు దరిచేరకుండా ఉంటాయని కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అలాగే గుడ్, బ్యాడ్ టచ్‌పై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాబున్ని, ఏఎన్‌ఎంలు నిర్మల, సువార్త, అంగన్వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి లిఖిత, తదితరులు

నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రభుత్వ నిబంధనలను పాటించని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు.

సోమవారం ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యం అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. ఫీజు నియంత్రణ చట్టం ప్రతి పాఠశాలలో అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమైక్య నాయకులు పవన్, మహబూబ్ తార, కుమార్ పాల్గొన్నారు.

వైవీయూ ఆచార్యుడికి స్వీడన్ సదస్సుకు ఆహ్వానం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలోని భూవిజ్ఞానశాస్త్ర ఆచార్యులు ఎన్. జయరాజుకు స్వీడన్‌లోని నోర్కోపింగ్ లో ఈనెల 27 నుంచి 30 వరకు జరిగే 8వ ప్రపంచ వాతావరణ సంస్థ కార్యాశాలకు కావాలంటూ ప్రతినిధుల నుంచి ఆహ్వానం అందింది. ఆచార్య జయరాజు 'భారతదేశంలోని బంగాళాఖాతం, హిందూ మహాసముద్రం ఉష్ణ మండల వాతావరణ వైవిధ్యం' అన్న అంశంపై కార్యశాలలో పత్ర సమర్పణ చేయనున్నారు. ప్రపంచంలోని పలు ప్రాంతాల నుంచి పరిశోధకులు, విషయ నిపుణులు హాజరుకానున్నారని వివరించారు. ఈయన ఇప్పటికే 70 దేశాల్లో క్షేత్ర సందర్శన చేసి పరిశోధన పత్రాలు సమర్పించారు. అనేక అంతర్జాతీయ జర్నల్స్ లో ఈయన రాసిన పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయి. ఆచార్య జయరాజుకు వైవీయూ అధికారులు అభినందనలు తెలిపారు.

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల పనులు పూర్తిచేయాలి

కడప కార్పొరేషన్ : కడప నగరంలో నూతనంగా నిర్మించిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ జీఎస్‌ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం ఆయన మార్నింగ్ విజిట్‌లో భాగంగా పుట్లంపల్లి ఇండస్ట్రీయల్ ఎస్టేట్, ఉక్కాయపల్లి గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లను, ఆకులవీధి, వినాయక నగర్‌లను పరిశీలించారు. పుట్లంపల్లి ముందు భాగంలో వేసిన కంపోస్ట్ క్లీన్ చేయించాలని, ప్రతిజోన్‌ నుంచి వచ్చిన తడి, పొడి చెత్త ప్రతిరోజూ 6 టన్నులకు తగ్గకుండా సేకరించాలన్నారు. ఉక్కాయపల్లె జీటీఎస్ వద్ద గంబుషియా ఫిష్ ట్యాంక్ లను పరిశీలించి ట్యాంకుల అడుగు భాగమున మట్టి ఏర్పాటు చేసి లోటస్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. వర్మీ కంపోస్ట్ ప్లాంట్ కు వాటర్ కనెక్షన్, త్రీఫేస్ ఎలక్ట్రికల్ పవర్ కనెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. ఆకుల వీధి వద్ద ఏర్పాటు చేసిన ప్రజా ఆరోగ్య కేంద్రం, స్టడీ హాల్‌లను పరిశీలించి డ్యామేజ్ అయిన పైకప్పు మార్చే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆరోగ్య కేంద్రం వెనకవైపు టాయిలెట్స్ నిర్మించాలని శానిటేషన్ విభాగ అధికారులకు సూచనలు ఇచ్చారు.